క్లుప్తంగా

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించండి



విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

పెద్దాపురం: స్థానిక వరహాలయ్యపేట చల్లా వారి గరువులో హై ఓల్టేజీ సమస్యతో నానా అవస్థలు పడుతున్నామని, సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు బుధవారం విద్యుత్ శాఖ ఏఈ సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేశారు. చల్లా వారి గరువుకు చెందిన గంజి సూర్యప్రకాష్, తాటికొండ సత్యనారాయణ, బద్ది కృష్ణ, పాలిశెట్టి సత్యన్నారాయణ, జామి అప్పారావు, టి.సత్యం తదితరులు కాలనీలో హైవోల్టేజీ వల్ల నిత్యం విద్యుత్ కోతతో అవస్థలు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి కాలనీకి మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఏఈ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

హెల్మెట్ విధిగా ధరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీసీ శివారెడ్డి

పెద్దాపురం: ప్రయాణ సమయంలో వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని స్థానిక రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మోటార్ వెహికల్ ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని జిల్లా రవాణా శాఖాధికారి శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాణ రక్షణకు విధిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక, ఏఎంవీఐ గౌరీశంకర్, రవి, పోలీసులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం: భావితరాలు గర్వపడేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని బీజేపీ నేత గౌరగపూడి చిన్నయ్యదొర అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో బుధవారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు బొలిశెట్టి రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ సేవలకు గుర్తింపుగా బీజేపీ భారతరత్నతో సత్కరించిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పురందరస్వామి ఆరాధనోత్సవాలు



ఆలయంలో భజనలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక పెద్ద బజార్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం సాయంత్రం పురందరస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారి ప్రార్థనా మందిరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి, సత్యనారాయణమూర్తి, మాండవ్య నారాయణస్వామి, లలితా, సత్యసాయి, లక్ష్మీగణపతి కోలాట భజన మండళ్లచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వాసవీ మహిళా సంఘ సభ్యులు కాపుగంటి పైడిరత్నం, కటకం హైమావతి, కుమారి, భవాని, సరస్వతి, మోహనలక్ష్మి పాల్గొన్ని భక్తులకు సేవలందించారు.

ఆస్తుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

గండేపల్లి: వారసత్వ ఆస్తులు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని పెద్దాపురం ఏడవ అడిషనల్ కోర్టు జిల్లా న్యాయమూర్తి జస్టిస్ జి.చాముండేశ్వరి సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వారసత్వ ఆస్తి మార్పిడి పత్రాలు క్రమ పద్ధతిలో ఆన్‌లైన్ చేసుకుంటే కోర్టులో సివిల్ తగాదాలు సులభంగా పరిష్కారమవుతాయన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ చట్టం, వరకట్న నిరోధక చట్టం, లోక్ అదాలత్, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై న్యాయ వాదులు ఎ.ప్రభుజీ, ఎం.రాంబాబు, ఎస్.దుర్గారావు, ఎస్ విశాలాక్షి అవగాహన కల్పించారు. స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భూ ధరలపై కొత్త బాదుడు

- ఫిబ్రవరి నుంచే రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు
- కౌడా పరిధిలో భూములకు 25 శాతం.. గ్రామీణ ప్రాంతాలలో 20 శాతం పెంపు

పెద్దాపురం: ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు, పెరిగిన విద్యుత్ చార్జీలతో సతమతమవుతున్న ప్రజలపై కూటమి ప్రభుత్వం మరో బాదుడుకు రంగం సిద్ధం చేసింది. దీంతో సగటు జీవి సొంతింటి ఆశలు మరింత సన్నగిల్లుతాయని చెప్పక తప్పదు. భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచేయడమే ఇందుకు కారణం. భూములు, గృహాల, భవనాల, కట్టడాల విలువ 30 శాతం పెరగనుంది. కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచే అమలు చేసేందుకు రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు పూర్తి చేసింది. కౌడా పరిధిలోని స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల విలువలు 25 నుంచి 30 శాతం పెరగనున్నాయి. దీని వల్ల స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్



క్రయ విక్రేతలతో పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

చార్జీలు, బదిలీ సుంకం తడిసి మోపెడు కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో భూములు, స్థలాలు, ఇళ్ల వంటి స్థిరాస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చార్జీలు ప్రతీ రెండేళ్లకు ఒకసారి, ఏటా 5 నుంచి 10 శాతం పెంపుదల అనివార్యం. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండడంతో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వారం రోజులుగా క్రయ విక్రయదారులతో కిటకిటలాడుతోంది. రిజిస్ట్రేషన్లు జోరుగా సాగిపోతున్నాయి.

23 పంచాయతీల్లోనే..

పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సుమారు మున్సిపాలిటీ, 26 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ 23 పంచాయతీలలో మాత్రమే భూములు, స్థలాలకే క్రయవిక్రయాలు జరుగుతాయి. దీని పరిధిలోని గండేపల్లి మండలం పి.నాయకంపల్లి, కె.నాయకంపల్లి, సూరంపాలెం, యల్లమిల్లి, రంగంపేట మండలంలో పెదరాయవరం, వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, కోటపాటు, కిర్లంపూడి మండలంలో భూపాలపట్నం, వీరవరం, పెద్దాపురం మండలంలో ఆనూరు, చంద్రమాంపల్లి, దివిలి, గుడివాడ, కాండ్రకోట, తూర్పుపాకల, కట్టమూరు, మర్లావ, రాయభూపాలపట్నం, సిరివాడ, తాటిపర్తి, తిరుపతి, ఉలిమేశ్వరం, వాలుతిమ్మాపురంతో పాటు పెద్దాపురం మున్సిపల్ స్థలాలకు మాత్రమే ఈ కార్యాలయంలో లావాదేవీలు జరుగుతాయి.

25 శాతం పెంపు

భూముల మార్కెట్ విలువలను స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ 2019 సవరించింది. ఆ భూములకు 16 శాతం, సవరించని వాటికి 20 శాతం ధరలు పెంచనుంది. 2023లో కొన్ని గ్రామాలను పొటెన్షియల్ విలేజీలుగా గుర్తించారు. వాటిలో పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ పరిధిలో మున్సిపాలిటీ వెరసి 23 గ్రామాలను పొటెన్షియల్ గ్రామాల జాబితాలో చేర్చారు.

ప్రజలను పీడించడం పద్ధతి కాదు



కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా ప్రజలపై భారం మోపుతున్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచారు. ఫిబ్రవరి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని చూస్తున్నారు. ఇది ప్రజలను మోసం చేయడమే. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు.

– గుణ్ణం లక్ష్మణరావు, ఫర్ ద పీపుల్ ఫౌండేషన్ చైర్మన్ పెద్దాపురం

లక్ష్యం రూ.47.85 కోట్లు



ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.47,85,35,000. అయితే ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.39,78,81,000 ఆదాయం సమకూరింది. కొత్త చార్జీలు అమలులోకి వస్తే 20 నుంచి 25 శాతం వరకు అదనంగా ఆదాయం సమకూరుతుంది.

– పి.విజయలక్ష్మి సబ్ రిజిస్ట్రార్, పెద్దాపురం

పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోండి

సీఐ కృష్ణభగవాన్



కృష్ణభగవాన్

సామర్లకోట: పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎస్పీ బిందు మాధవ్ సూచనల మేరకు ప్రజల నుంచి మంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ మేరకు 24 గంటలూ ఏ సమయంలోనైనా అత్యవసర పరిస్థితులలో 94407 96568కు ఫోన్ చేయాలని సూచించారు. షాపుల యజమానులతో పాటు ఇళ్ల వద్ద కూడా సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు నివారించవచ్చని పేర్కొన్నారు. మద్యం, జూదం, అసాంఘిక కార్యక్రమాల వంటి సంఘటనలు ఆయా ప్రాంతాల్లో గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. రాత్రి సమయాల్లో ఎవరైనా తలుపులు కొడితే తీయవద్దని, వచ్చింది ఏవరో నిర్ధారణ చేసుకున్న తరువాత మాత్రమే తలుపులు తీయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పిల్లలకు సెల్ ఫోన్లు ఇచ్చిన సమయంలో సైబర్ నేరస్తుల నుంచి వచ్చిన ఫోన్ తీసే ప్రమాదం ఉంటుందని, వాటిని గమనించాలన్నారు. తెలియని వ్యక్తులకు ఇళ్లను అద్దెలకు ఇవ్వవద్దన్నారు. పోలీసులు అన్ని వేళలా అండగా ఉంటామని, తమ సేవలను వినియోగించుకోవాలని అన్నారు.

మట్టి గుట్టలు, పూడిక తొలగింపు



మఠంసెంటర్ దుకాణాల వద్ద పూడిక, కల్వర్టు శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్ షాపుల వద్ద ఉన్న మట్టి గుట్టలు, పూడికను బుధవారం తొలగించారు. ఇలా అయితే ఎలా! అనే శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సుమారు నెల రోజుల క్రితం మఠంసెంటర్‌లో డ్రైనులో పూడికతీత పనులలో భాగంగా స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ (ప్రస్తుతం ఎస్బీఐ)తో పాటు షాపులు ఉన్న ప్రదేశంలో కల్వర్టు తొలగించారు. ఈ మేరకు డ్రైనులో తీసిన పూడికను షాపుల వద్దనే వదలేశారు. కల్వర్టు మట్టి శిథిలాలను అక్కడే వదిలేయడంతో సుమారు నెల రోజుల పాటు షాపుల యజమానులతో పాటు బ్యాంకుకు, అక్కడ ఉన్న ఏటీఎంకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీరి సమస్యలపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు శిథిలాలను, పూడికను వెంటనే తొలగించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పూడికను తొలగించి, బ్లీచింగ్ పిచికారీ చేశారు. దీంతో ఆ ప్రాంత దుకాణదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు డ్రైనుపై ఉన్న కల్వర్టును నిర్మించే వారు షాపులకు చేరుకునేలా రేకులను ఏర్పాటు చేస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని షాపుల యజమానులు తెలిపారు.

డ్రగ్స్ వద్దు బ్రో!

- డ్రగ్స్, ఈవ్ టీజింగ్‌లపై విద్యార్థులకు అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: డ్రగ్స్ వద్దు బ్రో...! అనే నినాదంతో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో బుధవారం పిఠాపురం సర్కిల్ పోలీసులు విద్యార్థులకు డ్రగ్స్, ఈవ్ టీజింగ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఈవ్ టీజింగ్, డ్రగ్స్ బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా తమను సంప్రదించవచ్చని తెలుపుతు పిఠాపురం సర్కిల్ పోలీసు అధికారులు, స్టేషన్లు ఫోన్ నంబర్లు విద్యార్థులకు ఇచ్చి తమకు సమాచారం ఇవ్వవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు వి.మణికుమార్, ఎస్‌కే బాషా, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఏజెన్సీకి వాహన సామర్థ్య తనిఖీలు

- రవాణా శాఖ కార్యాలయంలో నిలుపుదల
- నేటి నుంచి ఏటీఎస్ ద్వారా తనిఖీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రవాణా వాహనాలకు ఆ శాఖ కార్యాలయంలో నిర్వహించే సామర్థ్య పరీక్షలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పటి వరకూ ఎంవీఐల ఆధ్వర్యంలో తనిఖీలు చేసి ఫిట్‌నెస్ జారీ చేసేవారు. ఇక నుంచి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చామని ఆటోమేటిడ్ మెషీన్ ద్వారా(ఏటీసీ) ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేస్తారని ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో స్లాట్‌లు బుక్ చేసుకున్న వారందరికీ బుధవారం ఎఫ్‌సీలు నిర్వహించి ముగించారు. జిల్లా మొత్తానికి సేవలందించే బాధ్యతను ఒక ఏజెన్సీకు అందజేయడంతో కత్తిపూడి యూనిట్‌తో పాటు పెద్దాపురం యూనిట్‌కు సంబంధించి ఆయా మండలాల పరిధిలో ఉన్న వాహనాలు అన్నీ ఇక నుంచి కాకినాడ బీచ్ రోడ్డులో ప్రైవేట్ ఏజెన్సీ ఏర్పాటు చేసుకున్న ప్రాంతానికి రావాల్సి ఉంటుంది. ఇక నుంచి వాహనాలకు ఫిట్‌నెస్ కావాలంటే వ్యయప్రయాసలకు గురికావడంతో పాటు సమయం వృధా అవుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కత్తిపూడి పరిధిలో ఉన్న గిరిజన ప్రాంతాలు, పెద్దాపురం పరిధిలో మెట్ట గ్రామాల నుంచి కాకినాడ రావాలంటే దాదాపు 100 నుంచి 150 కిలోమీటర్లు రావాల్సి ఉంది.

ప్రభుత్వ ఆదేశాలతో నిలుపుదల



ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం వరకూ మ్యానువల్ విధానంలో వాహనాలు తనిఖీ చేసి ఫిట్‌నెస్‌లు జారీ చేశాం. ఇక నుంచి సేవలు నిలిచిపోతాయి. స్లాట్‌లు బుక్ చేసుకునేవారు వాహన యాప్‌లో ఏజెన్సీ స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. ఇక నుండి వాహన యాజమానులు ఈ విషయం గుర్తించాలి.

- కె.శ్రీధర్, డీటీసీ, కాకినాడ

జీవనోపాధి మెరుగుపరిచేందుకు చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ భావన
- కార్యాచరణ అమలుపై సమీక్ష

కాకినాడ: పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజల జీవనోపాధి అవకాశాలను మెరుగుపర్చి నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, దీన్‌దయాళ్ జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ మార్గదర్శకాల ప్రకారం అన్ని పట్టణ ప్రాంతాల్లో ప్రతిపాదించిన సిటీ లైవ్‌లీవుడ్ యాక్షన్ ప్లాన్ అమలుపై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజల సామర్థ్యం, నైపుణ్యం ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించి తద్వారా ఆయా కుటుంబాల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం 'మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్' ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంఎస్ఎంఈ భాగస్వామ్యంతో రానున్న ఐదేళ్లకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రోత్సాహాన్ని ఇస్తామన్నారు. ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ సభ్యులు శరత్, టీపీ ఆర్వో శైలజ, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ప్రసాద్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వారిది వైఫల్యం.. వీరిది కర్తవ్యం..!

- కూలిన రెయిలింగ్‌కు పోలీసుల భద్రత
- నిర్లక్ష్యం వహిస్తున్న ఆర్ అండ్ బీ శాఖ
- నిర్వహణ నిధులు లేవంటూ పలాయన మంత్రం పఠిస్తున్న వైనం



రెయిలింగ్ ధ్వంసమైన ప్రాంతంలో రిబ్బన్, బైండింగ్ వైర్‌తో రక్షణ ఏర్పాటు చేసిన పోలీసు సిబ్బంది



(అంతర చిత్రం) గోడ వద్ద బైండింగ్ వైర్ చుడుతున్న పోలీసులు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కూలిన రెయిలింగ్ ప్రదేశాల్లో పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో బ్రిడ్జిపై నాలుగు ప్రదేశాల్లో కూలిన రెయిలింగ్ వద్ద బైండింగ్ వైర్లతోను, రంగు రిబ్బన్లతో చేతనైనంతలో రక్షణ ఏర్పాటు చేశారు. వారు కట్టినవి వాహనాలో, పాదచారులో ఆదమరచి పడిపోతే ఆపలేవని తెలిసినా ప్రమాదం జరగకుండా నామమాత్రంగానైనా కర్తవ్య నిర్వహణ చేశారు. సామర్లకోట–పెద్దాపురం ఏడీబీ రోడ్డు వైపు కంటి ఆస్పత్రి ఎదురుగా, సత్యనారాయణపురం వెళ్లే మార్గంలో, రైల్వే ఆస్పత్రి వైపు, బార్ ఎదురుగా పలు వాహనాలు ఢీకొనడంతో ఫ్లైఓవర్‌పై రెయిలింగ్ శిథిలమైంది. ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై నిత్యం అనేక మంది పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. వారి ఇబ్బందిని గమనించి పోలీసులు ఈ రక్షణ చర్యలు చేపట్టారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కూలిన రెయిలింగ్ ప్రదేశాలలో మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ పి.ఫణీశ్వరరావును వివరణ కోరగా మెయింటనెన్స్ నిధులు నిలిపివేశారని తెలిపారు.

హక్కులపై చైతన్యం కలిగించాలి

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- గిరిజన ప్రాంతాల కార్యదర్శులకు ముగిసిన శిక్షణ



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

సామర్లకోట: గిరిజన ప్రాంతాల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై వారికి చైతన్యం కలిగించాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. ఈటీసీలో రెండు రోజుల పాటు నేర్చుకున్న అంశాలను గిరిజన ప్రాంతాల్లో అమలు చేయాలని ఆయన శ్రీకాకుళం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రెండు రోజుల పాటు వారికి నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం రాజ్యాంగంలో కొన్ని హక్కులను పొందుపరిచారన్నారు. ఆ హక్కులపై వారికి అవగాహన లేకపోవడం వలన వాటిని వినియోగించుకోలేక పోతున్నారన్నారు. కొంత మంది గిరిజనులు వారు పండిస్తున్న పంటలను దళారుల వలన మోసపోతున్నారని చెప్పారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండే విధంగా ప్రభుత్వం గిరిజన ప్రాంతాలలోని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు గిరిజనుల హక్కుల సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ వివిధ అంశాలపై ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు పి.శ్రీనివాస రావు, జి.శ్రీదేవి, వి.ప్రసాద్, కేఆర్ నిహారిక, డీఆర్ఎస్ పద్మజ, ఎస్‌కే మొహిద్దీన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రత్తిపాడు: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు సూచించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, ఓటీపీ అడిగితే తెలపరాదన్నారు. ప్రజలు వేరే ఊళ్లకు వెళ్లే సమయంలో ఇంటిలోని విలువైన బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో గాని, బంధువుల వద్ద కానీ భద్రపరచుకోవాలన్నారు. ఊరు విడిచివెళ్తున్న విషయాన్ని తమకు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు. ప్రజలు తమ నివాస భవనాలు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలకు పోలీస్ సహాయం అవసరమైతే స్థానిక సర్కిల్ పరిధిలోని సీఐ 94407 96530, ప్రత్తిపాడు ఎస్సై 94407 96570, అన్నవరం ఎస్సై 94407 96571, ఏలేశ్వరం ఎస్సై 94409 04835, రౌతులపూడి ఎస్సై 94407 96552 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

గండేపల్లి: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గండేపల్లి సీఐ వైఆర్కే శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. ఏదైనా సహాయం అవసరమైతే గండేపల్లి సీఐ 94407 96529, గండేపల్లి ఎస్సై 94409 04841, జగ్గంపేట ఎస్సై 94407 96569, కిర్లంపూడి ఎస్సై 9440904834 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఔరా అనిపించిన పురులియా చౌ!



పురులియా చౌ సంప్రదాయంలో ప్రదర్శిస్తున్న మహిషాసుర మర్ధిని నృత్య రూపకం

- ఆహూతులను మైమరపించిన నృత్య రూపకం
- కళ్లకు కట్టిన మహిషాసుర మర్ధిని, అభిమన్యు వధ ఘట్టాలు

పిఠాపురం: స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం పశ్చిమ బెంగాల్‌లో ప్రసిద్ధి చెందిన పురులియా చౌ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ నృత్యం ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. రూపకంలో పాత్రధారులు వారి హావభావాలతో ఔరా అనిపించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఈ సెమి క్లాసికల్ జానపద నృత్యం పరమ శివుని పూజించడానికి అనాదిగా వస్తున్న పూజా విధానాలు శాస్త్రాలు మంత్రాల నుంచి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. 2010లో యునెస్కో కనుమరుగవుతున్న సాంస్కృతిక వారసత్వ సంపద 'పురులియా చౌ' అని వారి జాబితాలో చేర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చౌ అనే పదం సంస్కృత పదం ఛాయ నుంచి వచ్చిందని ఛాయ అంటే సెమీ క్లాసికల్ జానపద నృత్యంగా వారు తెలిపారు. ఈ నృత్యంలో కళాకారులు అనేక వర్ణాలతో కూడిన దుస్తులు, మాస్కులతో అనేక విన్యాసాలు చేసి ప్రేక్షకులను తన్మయత్వానికి గురి చేసాయి. మొహురి, షెహనాయ్ వంటి సంగీత వాయిద్యాలు, రకరకాల తాళ వాయిద్యాలతో డోలు, డ్రమ్స్, ఖర్కా, మొదలైన తాళ వాయిద్యాలు సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశాయి. మహిషాసుర మర్దిని, అభిమన్యు వధ ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపారు. 98 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి ఖ్యాతి గడించిన ఈ నృత్య రూపకాన్ని వీక్షించిన ప్రేక్షకులు నటీనటులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మన ఊరు మన బాధ్యత సభ్యులు పాల్గొన్నారు.